క్లుప్తంగా

మంత్రిని కలిసిన ప్రజాప్రతినిధులు



చిల్పూర్: మల్కాపూర్ పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలని బుధవారం హైదరాబాద్‌లో ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావును జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్‌లు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తే ఎంతో మంది పేద రోగులకు వైద్యసేవలు అందుతాయని వివరించగా వెంటనే స్పందించిన మంత్రి త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మల్కాపూర్, లింగంపల్లి, వెంకటాద్రిపేట సర్పంచ్‌లు కొంగరి రవి, ఏదునూరి రవీందర్, కందుల రఘుపతి, ఉప సర్పంచ్ బబ్బుల వంశి, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ రంజిత్‌రెడ్డి, రమేష్, రాజభూపతి, జయపాల్‌రెడ్డి, రాము, రాజు ఉన్నారు.

'ఎర్రబెల్లి'కి అంగన్‌వాడీ టీచర్ల వినతి

దేవరుప్పుల: ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే పలు సౌకర్యాలతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు బుధవారం మొండి చింతతండాలో వినతి పత్రం అందజేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌గా టీచర్లకు రూ. 5 లక్షలు, ఆయాలకు రూ.3 లక్షలు ఇస్తూ పెన్షన్, కారుణ్య నియామకాలు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సువర్ణ, రామతార, కనకలక్ష్మి, మంగమ్మ, సునీత,సాలమ్మ, పద్మ, రేణుక, కళ, నిర్మల, యాదమ్మ ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ స్వయంభూ శ్రీ సిద్దేశ్వరాయలంలో ఈ నెల 16 నుంచి నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు పలువురు అధికారులకు ఆహ్వాన పత్రికలను అందజేశామని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ వి. అనిల్‌కుమార్, ఆర్‌జేసీ ఎం.రామకృష్ణను కలిసి శాలువాలతో సన్మానించి ఆహ్వాన పత్రికలను అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చిందం వంశీ, జూనియర్ అసిస్టెంట్ చల్ల రాజేందర్‌రెడ్డి, గంగం భానుప్రకాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పల్లగుట్ట విద్యార్థి ఎంపిక

చిల్పూర్: మండలంలోని పల్లగుట్ట ఉన్నత పాఠశాలలో చదువుతున్న దోమల భాను రాష్ట్ర స్థాయి ఇంగ్లిష్ స్టోరీ టెల్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కేతిడి నర్సింహారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో ఇంగ్లిష్ స్టోరీ టెల్లింగ్ పోటీలను నిర్వహించగా, భాను ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణలో భానును గైడ్ టీచర్ వోమ ప్రకాష్ ఆధ్వర్యంలో అభినందించారు. సర్పంచ్ మానస, ఎంపీటీసీ ఝాన్సీ, చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, ఉపాధ్యాయులు నరసింహారావు, లక్ష్మి, కోమలి, సురేష్, వనజ, మమత, చంద్రశేఖర్‌రెడ్డి, తెలుగు టీచర్ లక్ష్మి పాల్గొన్నారు.

జాతర సందర్శన

చిల్పూరు: మండల కేంద్రంలోని సమ్మక్క–సారలమ్మ మినీ జాతరను బుధవారం సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్ సందర్శించారు. మొదట గద్దెల వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం నాలుగు రోజులు వచ్చే భక్తుల కోసం చేపట్టే సౌకర్యాలను పరిశీలించారు. జాతర చైర్మన్ ఆవుల లింగయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మాచర్ల స్వామి, ఉప సర్పంచ్ మహేందర్, డిష్ వెంకన్న, సత్యనారాయణ, ఉట్కూరి సునయ్, ఆవుల రాజు, జంగిటి కుమార్, మాచర్ల ప్రవీణ్ ఉన్నారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన పూజలు

దేవరుప్పుల : మండలంలోని బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన కోసం దేశగురువు ధనుంజయ పర్యవేక్షణలో పూజారి భాస్కరవజ్జుల రామ్మూర్తిశర్మ, సోమేశ్వరశర్మ బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ నిర్మాణానికి ప్రతీకైన బొడ్రాయి ప్రత్యేకతను ప్రజలకు చాటాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూర్నాల రవి, ఎంపీటీసీ దామెర రమ, కోతి ప్రవీణ్, నాగయ్య, శ్రీనివాస్, మోహన్, యాకస్వామి, ఇంద్రస్వామి, కృష్ణమూర్తి, ఖాసీమ్, దామెర అనిల్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠాపన వేడుకలు



స్వామి వారి కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేద పండితులు



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

జనగామ: జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీ మూలబావి శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం శ్రీ రామనాథ సహిత శ్రీ సీతారాములు, గణపతి, సుబ్రహ్మణ్య, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకుడు డాక్టర్ మోహన కృష్ణ భార్గవ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ప్రతిష్ఠాపన మహోత్సవం కనుల పండువగా సాగింది. ఉదయం మీనలగ్న పుష్కరాంశ సుముహూర్తమున స్వామి దివ్య యంత్ర స్థాపనలు, విగ్రహ స్థాపనలు జరిపించారు. బలిహరణ, పూర్ణాహుతి అనంతరం విశేష అర్చనలు చేపట్టారు. శ్రీ సీతారామచంద్రస్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం పటిస్తూ పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన ఋత్విక్కులు, వేదపండితులను ఘనంగా సన్మానించారు. వేడుకల్లో గజ్జెల నర్సిరెడ్డి, కందాడి మల్లారెడ్డి, పాశం శ్రీశైలం, జక్కా ఉపేందర్ రెడ్డి, నర్సిరెడ్డి, యెలసాని కృష్ణమూర్తి, రాంబాబు, కుర్రెముల రాంప్రసాద్, సత్యనారాయణ, హనుమారెడ్డి, ఉమాకర్, దామోదర్, వెంకట్ రెడ్డి, చంద్రమౌళి, యాదగిరి, వేదపండితులు సాయికృష్ణ శర్మ, ఆదిత్య శర్మ, హరిశర్మ, చల్లా విశ్వతేజ, కృష్ణకుమార్, శ్రీనివాస్, రాజేశ్వర్, రాజేంద్ర, రాంబాబు, సాయి తేజ, సనత్, సంపత్ తదితర పండితులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం



గొడుగును అందజేస్తున్న వెంకటేశ్వర్లు రెడ్డి

బచ్చన్నపేట: నిరుపేదలకు సేవ చేయడమే లయన్స్ క్లబ్ లక్ష్యమని, ఇప్పటి వరకు చాలా మందికి తోడ్పాటును అందించామని లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు మల్లవరం వెంకటేశ్వర్లు రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో చిరు వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ క్లబ్ ద్వారా పేద విద్యార్థులకు నోట్ బుక్స్, బూట్లు, పలు రకాల వస్తువులను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ రీజియన్ చైర్మన్ ఈదులకంటి ప్రతాప్‌రెడ్డి, క్లబ్ సభ్యులు జిల్లా రాజేశ్వర్, బేజాడి సిద్దులు, రామిని మదన్, నరహరి, సుధాకర్‌రెడ్డి, రాజ్‌కుమార్, దాసరి శ్రీనివాస్‌రెడ్డి, బోడకుంటి మల్లయ్య, రవికుమార్, కరుణాకర్‌రెడ్డి, గట్టు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వేతన జీవులను వంచించిన కేంద్రం

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్ర ప్రభుత్వం వేతన జీవులను వంచించిందని, ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి మధ్య తరగతి వేతన జీవులకు భారీ ఊరట పేరుతో ప్రచారం చేసుకోవడం సమంజసం కాదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాష్ అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. పాత, కొత్త పన్ను విధానాలను కొనసాగిస్తూ క్రమంగా పాతపన్ను విధానాన్ని ఎత్తివేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైందన్నారు. కార్పొరేట్లు, ధనికులకు అధిక పన్ను రాయితీ ఇచ్చిన ప్రభుత్వం చిన్న, మధ్య తరగతి ఉద్యోగులకు ఏమాత్రం ప్రయోజనం కలిగించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ ద్వారా ధరలు ఏమాత్రం తగ్గే అవకాశం లేదని, గృహ నిర్మాణానికి ప్రోత్సాహం లేదని, మొత్తంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన బడ్జెట్ సగటు వేతన జీవులకు ఏమాత్రం సంతృప్తిని కల్గించలేదని ఆయన విమర్శించారు.

అదనపు కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, చాంబర్ అధ్యక్షుడు

జనగామ: అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బుధవారం కార్యాలయ ఉద్యోగులు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆయనను కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున, చాంబర్ అధ్యక్షుడు పోకల లింగయ్య ఏసీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి కూతురు, జనగామకు చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు కత్తుల రాజిరెడ్డి కుమారుడి వివాహ మహోత్సవానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

టీఎన్జీఓ ఆధ్వర్యంలో..

జిల్లా సమీకృత కలెక్టరేట్ చాంబర్‌లో టీఎన్జీఓ యూనియన్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ బర్త్ డే ఘనంగా నిర్వహించారు. నాయకులు కె.సంపత్, హఫీజ్, మధు, సావిత్రి, పూర్ణిమ, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ యూనియన్ అధ్యక్షుడు రాజేష్, కనకరాజు, సత్యపాల్, ఖాజా పాల్గొన్నారు.

మొక్కలను రక్షించాలి



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రఘురామకృష్ణ

బచ్చన్నపేట: గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కల చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించి చుట్టూ ముళ్ల కంచెను ఏర్పాటు చేసి వాటిని రక్షించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి వన నర్సరీలను, పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పడుతూ, నర్సరీల్లో మొక్కలను పెంచాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నర్మెట: స్థానిక మోడల్ పాఠశాలలో కెమిస్ట్రీ, కామర్స్ బోధించేందుకు తాత్కాలిక పద్ధతిలో ఉపాధ్యాయుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి. శరత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ తోపాటు బీఈడీ అర్హత కల్గిన అభ్యర్థులు ఈనెల 6లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గౌరవ వేతనం రూ.18, 200 ఉంటుందని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 96765 98411 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పశువుల ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ వహించాలి



మందులు అందజేస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

జఫర్‌గఢ్: పశువుల ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ వహించాలని జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్ అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మంపేటలో ప్రాంతీయ పశువైద్యశాలలో నిర్వహించిన గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరాన్ని బేబి శ్రీనివాస్, సర్పంచ్ మంద మల్లేశంతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పశువులు వ్యాధిబారిన పడకుండా ముందస్తుగా ప్రభుత్వం వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ శిబిరాల్లో పశువులకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. పశుసంపద ద్వారా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు సారంగపాణితో పాటు పశు వైద్యులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చేయూత



రఘునాథపల్లి: జనగామ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు మరోసారి దాతృత్వాన్ని చాటుకున్నారు. వృత్తి పరంగా వైద్య సేవలందించడమే కాదు, ఆపదలో ఉన్న వారికి ఆర్థికంగా ఆదుకునే ఆయన బుధవారం ఓ దివ్యాంగుడికి చేయూతనందించారు. మండలంలోని నిడిగొండ గ్రామానికి చెందిన దివ్యాంగుడు వాతాల యాదగిరి పేదరికంతో పడుతున్న ఆర్థిక ఇబ్బందులను వాట్సప్ గ్రూపుల్లో చూసి డాక్టర్ చలించారు. నిడిగొండలో దివ్యాంగుడి వద్దకు వెళ్లి మాట్లాడి డాక్టర్ రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట డీడబ్ల్యూఓ జయంతి ఉన్నారు.

వైన్‌షాపుల తనిఖీ



స్టాక్ పత్రాలను పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని వైన్‌షాపులను ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసులు బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో ఉన్న స్టాక్ రిజిస్టర్లు, స్టాక్‌లో ఉన్న మద్యం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ నెల చేసే సాధారణ తనిఖీల్లో భాగంగా వైన్ షాపులను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మకాలు చేయాలని, లూజ్ సేల్స్ చేయొద్దని, నిబంధనలను విధిగా పాటించాలని ఆయన సూచించారు.

జాతీయ సదస్సులో జీడి రమేశ్

చిల్పూరు: మండల పరిధి పల్లగుట్ట గ్రామానికి చెందిన జీడి రమేశ్ కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన జాతీయ సదస్సులో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో ఆయన 'తెలంగాణ ఉద్యమం– నవలా సాహిత్యం' అనే అంశంపై పత్రం సమర్పించనున్నారు. ఈ సందర్భంగా రమేశ్‌ను చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, సర్పంచ్ మానస, కేయూ స్కాలర్ డాక్టర్ చిర్ర సుమన్‌గౌడ్, ఆనందం అభినందించారు.

క్రైం కార్నర్

ట్రాలీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

రఘునాథపల్లి: ట్రాలీ ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని అశ్వరావుపల్లికి చెందిన వాంకుడోత్ శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై మండల కేంద్రానికి చేరుకొని తిరిగి వెళ్తుండగా జనగామ వైపు వస్తున్న ట్రాలీ ఢీకొట్టింది. దీంతో బైకుపై ఉన్న శ్రీనివాస్ ఎగిరి రోడ్డుపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని గాయాలైన శ్రీనివాస్‌ను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టైరు పేలి పల్టీకొట్టిన కారు

దేవరుప్పుల: మండలంలోని కోలుకొండ శివారు పెద్దగుట్ట సమీపంలో కారు టైరు పేలి (బస్ట్) పల్టీ కొట్టిన సంఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం హైదరాబాద్ నుంచి తొర్రూరు మండలం ఉప్పరపల్లికి వెళ్తుండగా పెద్దగుట్ట వద్ద కారు టైరు(టీఎస్07యూహెచ్ 6350) పేలి మూడు పల్టీలు కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్రగాయాలవ్వడంతో స్థానికుల సమాచారం మేరకు అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం లభ్యం

జనగామ: జనగామ–పెంబర్తి గ్రామాల పరిధిలోని బాణాపురం సరిహద్దులో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం లభించినట్లు బుధవారం రైల్వే పోలీసులు తెలిపారు. ప్రమాదం ఎలా జరిగిందో విచారణ చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. మృతుని తల భాగం పూర్తిగా దెబ్బతినడంతో గుర్తు పట్టలేని స్థితిలో ఉందని, ప్రస్తుతం జిల్లా ఆస్పత్రి పోస్టుమార్టం గదిలో భద్రపరిచినట్లు చెప్పారు.

రాష్ట్ర బడ్జెట్‌లో దివ్యాంగులకు 5శాతం నిధులు కేటాయించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో దివ్యాంగులకు ఐదు శాతం నిధులను కేటాయించాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తోట సురేందర్ అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రవేశపెడుతున్న బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమం కోసం నిధులను కేటాయించడం లేదన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక చొరవతో పనిచేయాలని, ఆసరా పింఛన్లకు ఆదాయ పరిమితి విధించే జీఓ 17ను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న వివాహ ప్రోత్సాహకాలు, రుణాలు, పరికరాలను పంపిణీ చేయాలన్నారు. డబుల్‌బెడ్రూం ఇళ్లలో 5 శాతం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యతోనే సమాజంలో గౌరవం

● ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



రఘునాథపల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రఘునాథపల్లి: సమాజంలో గౌరవం, సకల సమస్యల పరిష్కారానికి చదువు ఒక్కటే మార్గమని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. 'మన ఊరు–మనబడి'లో భాగంగా అశ్వరావుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫర్నిచర్, గ్రీన్ బోర్డులు, టాయిలెట్లను ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల సమూల మార్పుకోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ రాంరెడ్డి, జెడ్పీటీసీ బొల్లం అజయ్, మండల ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్, ఎంపీడీఓ హసీం, పీఆర్ డీఈ శ్రీనివాస్, సర్పంచ్‌లు పోకల శివకుమార్, తూముకుంట్ల సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సుల్తాన్ దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

లింగాలఘణపురం: మండలంలో మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే రాజయ్య కోరారు. బుధవారం మంథోనిగూడెంలో పంచాయతీ భవనం, సీసీరోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామంలో ముదిరాజ్ భవనానికి రూ.5లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీపీ జయశ్రీ, జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



మాట్లాడుతున్న జనార్దన్

స్టేషన్‌ఘన్‌పూర్: వ్యవసాయ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవతో పనిచేస్తూ సమగ్ర చట్టం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళపల్లి జనార్దన్ డిమాండ్ చేశారు. డివిజన్‌కేంద్రంలో ఆ సంఘం మండల కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరితో కార్మికులు దుర్భర జీవితాలు గడుపుతున్నారని, వ్యవసాయ కార్మికుల కోసం రూ.25వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని అన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం అనుబంధ బీకేఎంయూ మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బూర్ల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా సముద్రాల రాజు ఎన్నికయ్యారు.

వైఎస్సార్‌టీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో రాజగోపాల్, వెంకట్ రెడ్డి

నర్మెట: షర్మిల ఆధ్వర్యంలోని వైఎస్సార్ టీపీతోనే తెలంగాణలో రాజన్న రాజ్యం సాధ్యమని జీహెచ్ఎంసీ కోఆర్డినేటర్ వాడుక రాజగోపాల్, జనగామ కోఆర్డినేటర్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి అన్నారు. నర్మెట, తరిగొప్పుల మండలాలకు చెందిన పలు పార్టీల నాయకులు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్‌టీపీలో చేరగా రాజగోపాల్ పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిరస్థానాన్ని సంపాదించుకున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారిలో పాతూరి కరుణాకర్ రెడ్డి, అర్జుల అంజిరెడ్డి, ముదికి కుమార్, కలకుంట్ల రాజేందర్, తాళ్ళ కొక్కుల రవి, సొంటెక్క వెంకన్న, మోటం మొగిలి, అరవెల్లి బాలయ్య, సురేష్, సత్తయ్య ఉన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ప్రజలు వినియోగించుకోవాలని మేనేజర్ విష్ణువర్దన్ రెడ్డి అన్నారు. బుధవారం బ్యాంకులో ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో రుణాలను తీసుకున్న వారు వాయిదాలను సకాలంలో చెల్లించి రాయితీలను పొందాలని చెప్పారు. అలాగే వ్యవసాయ రుణాలను ప్రతీ సంవత్సరం రెన్యువల్ చేసినట్లయితే తక్కువ వడ్డీ పడుతుందని, లేకుంటే వడ్డీ అసలుకు కలిసి ఎక్కువ మొత్తంలో చెల్లించాల్సి వస్తుందన్నారు. బ్యాంకు సేవలను అన్ని గ్రామాల్లో మినీ బ్యాంకుల ద్వారా అందిస్తున్నామని పేర్కొన్నారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'



'కంటివెలుగు'ను పరిశీలిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

పాలకుర్తి : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. బుధవారం మండలంలోని వావిలాలలో కంటివెలుగు శిబిరాన్ని ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు సందర్శించి మాట్లాడారు. కంటివెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమని అన్నారు. 1,100 మందికి వైద్య పరీక్షలు చేసి 600 మందికి అద్దాలను అందించారని తెలిపారు. డాక్టర్ హరికృష్ణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న కడియం శ్రీహరి

చిల్పూర్: మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన బాధిత కుటుంబాలను బుధవారం ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. పల్లగుట్టలో మారగోని ఎల్లయ్యగౌడ్, కృష్ణాజీగూడెంలో మారపాక స్వామి, ఇదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మారపాక ఇసాక్ తల్లి ఎలిశమ్మ, చిల్పూరు మండలకేంద్రానికి చెందిన సాంబారి శంకర్, చిన్నపెండ్యాలకు చెందిన తాళ్లపల్లి రాజు తల్లిదండ్రులు లక్ష్మి–కొంరయ్య మృతి చెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట సర్పంచ్‌లు లింగారెడ్డి రాజ్‌కుమార్, లోడెం రజిత, ఎంపీటీసీ ఉమ సమ్మయ్య, రవీందర్, జంగిటి కుమార్, నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే రాజయ్య..

పల్లగుట్ట, కృష్ణాజీగూడెంలో మృతి చెందిన పలువురి కుటుంబాలను ఎమ్మెల్యే రాజయ్య పరామర్శించారు. సర్పంచ్ బొట్టు మానస, జీడి ఆనందం, బొట్టు చేరాలు తదితరులు ఉన్నారు.

పండుగలు సమైక్యతను పెంపొందిస్తాయి



దుర్గామాత పండుగ పత్రికను అందజేస్తున్న సర్పంచ్ వెంకట్‌గౌడ్

బచ్చన్నపేట: గ్రామస్తులు అందరూ కలిసి సామూహికంగా నిర్వహించుకునే పండుగలు అందరిలో సమైక్యతను పెంపొందిస్తాయని కొన్నె సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్ అన్నారు. బుధవారం గ్రామంలో దుర్గామాత పండుగ తేదీలను ఖరారు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 25వ తేదీన దుర్గామాతకు భోనాలు, 26న గ్రామస్తులు సామూహిక వన భోజనాలకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం పురోహితులు హన్మంతారావు, దుబ్బుల పూజారులు శ్రీనివాస్, నర్సింహులు, కిరణ్ పత్రికను రాసి గ్రామస్తులకు అందించారు. ఎంపీటీసీ మల్లనర్సవ్వ, ఉప సర్పంచ్ వంచ వెంకట్‌రెడ్డి, నాయకులు ఎల్లమ్మ, దశరథ, నర్సింహులు, వెంకటేష్, శివకుమార్, సిద్దారెడ్డి, రామచంద్రం, ఇస్తారి, సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.

'గుట్టలనూ వదలని రియల్టర్లు'

స్టేషన్‌ఘన్‌పూర్: రియల్టర్లు గుట్టలను సైతం వదలడం లేదని, ప్రభుత్వ భూములు, దేవాదాయ, అసైన్డ్, పేదల భూములను కాజేస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జువారి రమేష్ ఆరోపించారు. మండలంలోని తానేదార్‌పల్లిలో 33, 36 సర్వే నంబర్లలో ఉన్న ఏనెగుట్ట భూములు అన్యాక్రాంతమవుతున్న విషయం తెలుసుకొని రమేష్‌నాయక్ పార్టీ నాయకులు, పేదలు, దళితులతో కలిసి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో సర్వే నంబర్లు 33, 36లో ఉన్న 80 ఎకరాల భూమి గతంలో పంచరాయి భూమిగా ఉండేదని, అగ్రకులాల వారి పేరిట ఎలా పట్టా అయిందో సంబంధిత అధికారులు వివరించాలన్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భూపోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి తోట రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గట్టుమల్లు, సముద్రాల రాజు, ప్రభాకర్, రాజు, కిష్టయ్య, ముత్తయ్య, నర్సయ్య, ఎల్లయ్య ఉన్నారు.